# హక్కుల ఉద్యమకారుడు బాలగోపాల్‌కు నివాళి

'స్వేచ్ఛ' సంపాదకీయం, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం

హక్కుల నేత బాలగోపాల్ ఆకస్మిక మరణం ప్రజాస్వామికవాదులందరిని నిర్ఘాంత పరచింది. హక్కుల ఉద్యమ ప్రస్థానంలో ఆయన లేని లోటును ఇప్పట్లో భర్తీ చేయడం కష్టం. రాష్ట్రవ్యాపితంగా, దేశవ్యాపితంగా హక్కుల ఉద్యమానికి ఒక గుర్తింపును, విశ్వసనీయతను తీసుకురావడంలో బాలగోపాల్ విశేష కృషి దాగివుంది. హక్కుల ఉద్యమానికి ఒక కొత్త ఒరవడిని, దృక్పథాన్ని యివ్వడమే కాకుండా దాన్ని ఆచరణలో సాదించడానికి తన జీవితాన్ని అంకితం చేశాడు. బాలగోపాల్‌ది విశిష్టమైన వ్యక్తిత్వం. మేధావి, రచయిత, నేత, సాధారణ కార్యకర్త ఒకే వ్యక్తిలో మేళవించి ఉండటమే ఆయన ప్రత్యేకత. సంస్థకు బాధ్యతాయుత స్థానంలో ఉన్నా సాధారణ కార్యకర్తలాగా గోడకు పోస్టర్లు అంటించడం, కరపత్రాలు పంచడం, సంస్థ ప్రచురణలను అమ్మడం చేయగలడు. వ్యక్తే సంస్థగా, సంస్థలో ఒక వ్యక్తిగా గొంతులేని వారి తరఫున గొంతెత్తాడు. మన రాష్ట్రంలో హక్కుల ఉద్యమానికి చిరునామా అయ్యాడు. హక్కుల ఉద్యమ చరిత్రలో సమున్నతంగా నిలిచిపోయాడు.

1970ల ప్రాంతంలో శ్రీకాకుళ గిరిజన రైతాంగపోరాటాలపై ప్రభుత్వ ఫాసిస్టు దమనకాండకు వ్యతిరేకంగా, ప్రత్యేకించి బూటకపు ఎన్‌కౌంటర్ల రూపంలో అమలయిన రాజ్యహింసకు వ్యతిరేకంగా, మన రాష్ట్రంలో పౌరహక్కుల ఉద్యమం మొదలయింది. ఎమర్జెన్సీ తర్వాత బూటకపు ఎన్‌కౌంటర్లపై తార్కుండే కమిటి, జస్టిస్ భార్గవ కమీషన్‌ల విచారణ జరగడంలో పౌరహక్కుల సంఘం కృషివుంది. భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షలకు వ్యతిరేకంగా పౌరహక్కుల ఉద్యమం స్పందించి పనిచేసింది. ఆనాటి ప్రజా ఉద్యమాల స్ఫూర్తితో బాలగోపాల్ హక్కుల ఉద్యమాన్ని తన కార్యక్షేత్రంగా ఎంచుకుని 1980ల నుండి ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘానికి

దగ్గరయ్యాడు. కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నాడు. అనతికాలంలోనే, అనగా 1983లోనే సంస్థ ప్రధానకార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించాడు. 15 సంవత్సరాల పాటు సంస్థకు నాయకత్వం వహించి, పౌరహక్కుల సంఘాన్ని విస్తృత పరచడంలో ఎనలేని కృషి చేశాడు.

ఎటువంటి నిర్బంధాన్నైనా తట్టుకుని నిలబడగలగడం పౌరహక్కుల కార్యకర్తలకు వుండాల్సిన ముఖ్య లక్షణం. ఈ విషయంలో బాలగోపాల్ నుండి నేర్చుకోవాల్సింది ఎంతైనా వుంది. పౌరహక్కుల సంఘంపై ప్రభుత్వ నిర్బంధం తీవ్రరూపం దాల్చి, గోపిరాజన్న, జాపాలక్ష్మారెడ్డి, డా॥ రామనాథం, నర్రా ప్రభాకర్‌రెడ్డి, పురుషోత్తం, ఆజంఅలీలు రాజ్యహింసకు బలైపోయినా, తనను పోలీసులు కిడ్నాప్ చేసినా, ఏ మాత్రం బెదరకుండా సంస్థను ముందుకు నడిపించడంలో బాలగోపాల్ అసమాన ధైర్యసాహసాల్ని, చొరవను ప్రదర్శించాడు. సమాజంలో ప్రతి సమస్యకు హక్కులకోణం వుంటుందని చాటిచెప్పి, హక్కుల దృక్పథాన్ని విస్తృతపరచాడు. “సమాజంలో ప్రతి మనిషి గౌరవంగా, హుందాగా బ్రతకడానికి హక్కులు అవసరం. సమాజంలో అసమానతలను, ఆధిపత్యాన్ని, పీడనలను ప్రశ్నించడానికి హక్కులు ఒక సాధనం” అని బాలగోపాల్ హక్కుల అర్థాన్ని, అవసరాన్ని తెలియజెప్పాడు.

హక్కులు సార్వజనీనం, హక్కులు అందరికీ వుండాలి. వాటిని అనుభవించే అవకాశం అందరికీ వుండాలి. వాటిని ఉపయోగించుకునే సామాజిక, ఆర్థిక వాతావరణం ఉండాలని బాలగోపాల్ అభిలషించాడు. నిత్యం సమాజంలో సామాన్య ప్రజల హక్కులు ఏఏ రూపాల్లో ఉల్లంఘనలకు గురవుతున్నాయో పరిశీలించి, అందుకు దారితీసిన సామాజిక ఆర్థిక పరిస్థితుల్ని కారణాలను అవగాహన చేసుకుని, ప్రభుత్వ విధానాల మంచిచెడ్డలను చర్చించి ఎన్నో సమస్యలపై బాలగోపాల్ నివేదికలను రూపొందించాడు. నిజనిర్ధారణ అంటే కేవలం వాస్తవాలను సేకరించి పత్రికా ప్రకటనలు ఇవ్వడం కాదు. నిజనిర్ధారణ ద్వారా చేసిన అధ్యయనం, రిపోర్టులు ప్రజలను చైతన్య పరచడానికి ఉపయోగపడాలని, ఆ చైతన్యంతో ప్రజలు స్వతంత్రంగా తమ హక్కుల కోసం పోరాడే ధైర్యాన్ని పొందాలని బాలగోపాల్ చెప్పేవారు. తన పని విధానం హక్కుల కార్యకర్తలందరికీ అనుసరణీయం. ఇవ్వాళ హక్కుల సంస్థల్లో పనిచేస్తున్న వందలాది మందికి బాలగోపాల్ స్ఫూర్తిగా నిలిచాడు. సమాజంలో ముందుకు వచ్చే ప్రజాస్వామిక ఉద్యమాల ఆకాంక్షలను ఆకళింపు చేసుకోవడం, వాటిని సమర్థించడం, హక్కుల కోణం నుండి వాటికి మద్దతు తెలపడం హక్కుల ఉద్యమ కర్తవ్యంగా భావించాడు బాలగోపాల్.

పౌరహక్కుల ఉద్యమ పరిధిని, అవగాహనను విస్తృతపరచడంలో బాలగోపాల్

ప్రధాన భూమికను పోషించాడు. 1985లో కారంచేడులో దళితుల ఊచకోత ఘటన నేపథ్యంలో సమాజంలో హక్కుల ఉల్లంఘనకు 'కులవ్యవస్థ' కూడా ఒక ప్రధాన కారణమనే అవగాహనతో దళితులపై దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాడు. కులప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడం సమానత్వపు హక్కుకు వ్యతిరేకం అనే అభిప్రాయం నుంచి రిజర్వేషన్లు ఒక ప్రజాస్వామిక హక్కుగా అవగాహన చేసుకోవడంతోపాటు కుటుంబ హింసకు నేపథ్యంగా వున్న పురుషాధిక్య సమాజాన్ని గుర్తించి హక్కుల దృక్పథాన్ని విస్తరించాడు. కరువు సమస్యలో హక్కుల కోణాన్ని తీసుకువచ్చాడు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలను అమలు చేయకపోవడం, ప్రభుత్వ నిర్లక్ష్యం ద్వారానే కరువు సమస్య ఉందని, తద్వారా జీవించే హక్కుకు ప్రమాదం వుంటుందని వ్యాఖ్యానించాడు. రాజ్యహింసతోపాటు, ఇతర సామాజిక, ఆర్థిక వ్యవస్థల, ఆధిపత్య వ్యవస్థల హింసను అర్థం చేసుకోవాలన్నాడు. హక్కుల స్పృహతో వీటిని వ్యతిరేకిస్తూ ప్రజాస్వామీకరణ కోసం కృషిచేయాలని వాదించాడు.

కొన్ని అంశాలపై అవగాహనలో ఏర్పడిన అభిప్రాయభేదాల వల్ల బాలగోపాల్ 'మానవ హక్కుల వేదిక'ను ఏర్పాటు చేశాడు. అయినా ఏకాభిప్రాయం ఉన్న అనేక హక్కుల ఉల్లంఘనలపై పౌరహక్కుల సంఘంతో కలసి పనిచేశాడు. ఎన్నో ఉమ్మడి కార్యక్రమాల్ని చేపట్టడం జరిగింది. ఉద్యమకారుల హింసపై విమర్శనాత్మకంగా స్పందించినప్పటికి, రాజ్యహింసను ఎండగట్టడంలో ఎక్కడా రాజీపడలేదు. చివరగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 'ఆపరేషన్ గ్రీన్ హంట్' పేరుతో చేపట్టిన మావోయిస్టుల ఏరివేత కార్యక్రమం అమాయక గిరిజనుల మరణానికి దారితీస్తుందనే ఆందోళనతో 'ఆ వేటను ఆపమని నినదిద్దాం' అనే పిలుపునిచ్చాడు. ఇప్పుడు ఆ కంఠం మూగబోయింది.